నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence

www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

nipuna
Every Wednesday Free Supplement
27 డిసెంబర్ 2023
పేజీలు 8

## సల్మాన్ రష్దీకి శాంతి పురస్కారం

వివాదాస్పద రచయిత భారత సంతతికి చెందిన బ్రిటిష్ పౌరుడు సల్మాన్ రష్దీకి 'జర్మన్ బుక్ ట్రేడ్' సంస్థ శాంతి పురస్కారం జూన్ 21న లభించింది. ప్రతికూల పరిస్థితుల్లో సైతం వెరవకుండా మానవీయ కోణంలో రచనలు కొనసాగిస్తున్నందుకు ఆయన ఈ అవార్డు లభించిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

# అవార్డులు

### గ్లోబల్ లీడర్‌షిప్

- భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ న్యాయరంగంలో జీవితకాల సేవలకు 'గ్లోబల్ లీడర్‌షిప్' అవార్డును జనవరి 11న అందుకున్నారు. హార్వర్డ్ స్కూల్ ఆఫ్ లా ఈ అవార్డును అందించింది. గతంలో చంద్రచూడ్ ఈ లా స్కూల్‌లో డిగ్రీ, డాక్టరేట్ చేశారు.



### స్టాటిస్టిక్స్

- ప్రఖ్యాత భారతీయ అమెరికన్ గణిత శాస్త్రవేత్త సీఆర్ రావు (కల్యంపూడి రాధాకృష్ణారావు) గణిత నోబెల్‌గా పిలిచే 'ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటిస్టిక్స్-2023'ను ఏప్రిల్ 10న అందుకున్నారు. ఈయన 102 సంవత్సరాలు. 'ఇంటర్నేషనల్ స్టాటిస్టిక్స్ ఇన్‌స్టిట్యూట్' ప్రకటించే ఈ పురస్కారం కింద 80,000 డాలర్ల నగదు అందజేస్తారు. స్టాటిస్టిక్స్ రంగంలో ఈయన చేసిన కృషికి వైద్యం, వాణిజ్య, ఆర్థికం, ఆంత్రోపాలజీ శాస్త్రాల్లో విశేష ప్రయోజనాలు చేకూరాయి. గతంలో ఈయనకు పద్మవిభూషణ్, ఎస్ఎస్ భట్నాగర్ అవార్డులు లభించాయి.

### స్పినోజా

- డచ్ దేశ శాస్త్ర, సాంకేతిక రంగంలో ప్రతిష్ఠాత్మక పురస్కారం 'స్పినోజా'ను భారత సంతతి డచ్ దేశస్థురాలు జోయితా గుప్తాకు జూన్ 7న ప్రకటించారు. సుస్థిర ప్రపంచం అనే అంశంపై ఈమె చేసిన పరిశోధనలకు ఈ పురస్కారం దక్కింది. ఈ అవార్డుతో పాటు 15 లక్షల యూరోలు పరిశోధన ప్రోత్సాహకంగా లభిస్తుంది. డచ్ నోబెల్‌గా ప్రసిద్ధి చెందిన ఈ పురస్కారాన్ని ఆమ్‌స్టర్‌డామ్ యూనివర్సిటీ అందజేస్తుంది.

### పాయింట్స్ ఆఫ్ లైట్

- రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న సిక్కు సైనికుడు రాజిందర్ సింగ్ దత్‌కు బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ 'పాయింట్స్ ఆఫ్ లైట్' పురస్కారాన్ని జూన్ 29న అందజేశారు.

### నార్మన్ బోర్లాగ్

- అంతర్జాతీయ పరిశోధన సంస్థకు చెందిన భారతీయ యువ సైంటిస్ట్ స్వాతి నాయక్‌కు 'నార్మన్ బోర్లాగ్-2023' అవార్డు సెప్టెంబర్ 21న లభించింది. క్షేత్ర పరిశోధన, అన్వయాలకు సంబంధించి చేసిన కృషికి ఈ అవార్డు దక్కింది. ఆకలిని నిర్మూలించి, ఆహార భద్రతను సాధించే దిశగా కృషి చేసిన 40 ఏండ్లలోపు యువ సైంటిస్టులకు ఈ పురస్కారం అందజేస్తారు. ఈ అవార్డును వరల్డ్ ఫుడ్ ఫౌండేషన్ నోబెల్ బహుమతి గ్రహీత, హరిత విప్లవ పితామహుడు నార్మన్ బోర్లాగ్ పేరుమీద అందజేస్తున్నారు.

### కీర్తిచక్ర, శౌర్యచక్ర

- గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆరుగురికి కీర్తిచక్ర, 15 మందికి శౌర్యచక్ర, 412 మందికి గ్యాలంట్రీ అవార్డులు ప్రకటించింది.
- అశోకచక్ర తర్వాత రెండో అత్యున్నత పీస్‌టైమ్ గ్యాలంట్రీ 4అవార్డు కీర్తిచక్ర. కీర్తిచక్ర అవార్డులు డోగ్రా రెజిమెంట్‌కు చెందిన మేజర్ సుభాంగ్, రాజ్‌పుత్ రెజిమెంట్‌కు చెందిన నాయక్ జితేంద్రసింగ్‌కు లభించింది. మరణానంతరం ఈ అవార్డు పొందిన వారిలో జమ్ముకశ్మీర్‌కు చెందిన సబ్‌ఇన్‌స్పెక్టర్ దీపక్ భరద్వాజ్, హెడ్ కానిస్టేబుళ్లు నారాయణ్, శ్రావణ్ కాశ్యప్ ఉన్నారు.



### ఏబీకే ప్రసాద్‌కు అవార్డు

- జర్నలిజంలో అందించిన సేవలకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏటా అందించే రాజారామ్మోహన్ రాయ్-2023 అవార్డు ఏబీకే ప్రసాద్‌కు లభించింది.

### భాషా సమ్మాన్

- బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య బేతవోలు రామబ్రహ్మంకు ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ పురస్కారం 2021 సంవత్సరానికి లభించింది. ప్రాచీన మధ్యయుగ సాహిత్యంపై వెలువరించిన రచనలు, సాహితీ సేవలకు ఈ పురస్కారం దక్కింది.

మిగతా 8వ పేజీలో..

# ప్రముఖుల మరణాలు

### పోప్ బెనెడిక్ట్-16

- 2022 డిసెంబర్ 31న మాజీ పోప్ బెనెడిక్ట్-16 మరణించారు. ఈయన వయస్సు 95 సంవత్సరాలు. 2013లో పోప్ పదవి నుంచి మధ్యంతరంగా వైదొలిగారు. 600 ఏళ్ల వాటికన్ సిటీ చరిత్రలో పోప్ పదవి నుంచి మధ్యలో వైదొలగడం ఇదే ప్రథమం. ప్రస్తుతం పోప్ బాధ్యతలను పోప్ ఫ్రాన్సిస్ నిర్వహిస్తున్నారు.



### అత్యంత వృద్ధ మహిళ

- ప్రపంచంలోనే అత్యంత వృద్ధ మహిళ, కొవిడ్ నుంచి కోలుకున్న అత్యంత వృద్ధురాలిగా పేరుగాంచిన క్రిస్టియన్ సన్యాసిని (నన్) సిస్టర్ ఆండ్రీ తన 118వ ఏట జూన్ 17న మరణించారు. ఈమె అసలు పేరు లూసీ రాండన్. ఈమె ఫ్రెంచ్ దేశస్థురాలు.



### కె.విశ్వనాథ్

- ప్రముఖ తెలుగు చలన చిత్ర దర్శకుడు, నటుడు కె.విశ్వనాథ్ (92) ఫిబ్రవరి 2న మరణించారు. కళాతపస్విగా పేరుగాంచిన ఆయన సాగరసంగమం, శంకరాభరణం, సిరిసిరి మువ్వ, సప్తపది, స్వాతి ముత్యం, సిరివెన్నెల, శృతిలయలు, స్వయంకృషి, స్వర్ణకమలం, సూత్రధారులు, స్వాతి కిరణం తదితర సినిమాలు తీశారు. 1992లో రఘుపతి వెంకయ్య పురస్కారం, పద్మశ్రీ పురస్కారం ఆయనను వరించాయి. 2016లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు కూడా లభించింది.



### మనోజ్ మిశ్రా

- పర్యావరణ ఉద్యమకారుడు మనోజ్ మిశ్రా (68) జూన్ 4న కన్నుమూశారు. మనోజ్ మిశ్రా మాజీ ఐఎఫ్ఎస్ అధికారి. అడవులు, నదుల పరిరక్షణకు విశేష కృషి చేశారు. 2007లో 'యమునా జియే అభియాన్'ను స్థాపించి కాలుష్యం బారినుంచి యమునా నదిని కాపాడేందుకు పోరాటం చేశారు. ఈయన కృషి ఫలితంగానే జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) 2014లో యమునా నది పునరుజ్జీవానికి చర్యలు తీసుకుంది.



### జాన్ బీ గుడ్ ఎనఫ్

- నోబెల్ పురస్కార గ్రహీత, లిథియం అయాన్ బ్యాటరీని అభివృద్ధి చేసిన శాస్త్రవేత్త జాన్ బీ గుడ్ ఎనఫ్ జూన్ 25న మరణించారు. 2019లో ఈయనకు రసాయనశాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది.

### కె.ఎం. వాసుదేవ్

- ప్రముఖ మలయాళీ చిత్రలేఖకుడు కె.ఎం.వాసుదేవ్ నంబూద్రి (98) జూలై 6న మరణించారు. ఆయనకు గతంలో రాజా రవివర్మ పురస్కారం లభించింది. తెలుగు నాట బాపు చిత్రాల వలె కేరళలోనూ ఈయన చిత్రాలు మంచి ఆదరణ పొందాయి. దేశవ్యాప్తంగా ఈయన వినోద ప్రధాన చిత్రాలకు ప్రాచుర్యం ఉంది.



### ఊమెన్ చాందీ

- కేరళ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ఊమెన్ చాందీ (79) జూలై 18న మరణించారు. పుతుపల్లి నియోజకవర్గం నుంచి వరుసగా 12 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కేరళకు రెండుసార్లు ముఖ్యమంత్రిగా సేవలందించారు.

### సీఆర్ రావు

- ప్రముఖ భారతీయ అమెరికన్ సంఖ్యాశాస్త్రవేత్త సీఆర్ రావు(102) (కల్యంపూడి రాధాకృష్ణ రావు) ఆగస్టు 22న మరణించారు. ఈయనకు స్టాటిస్టిక్స్‌లో నోబెల్ బహుమతిగా పరిగణించే ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటిస్టిక్స్ అవార్డు లభించింది.



### ఎం.ఎస్. స్వామినాథన్

- భారత హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్. స్వామినాథన్ సెప్టెంబర్ 28న మరణించారు. అధిక దిగుబడినిచ్చే అనేక వరి వంగడాలను ఆయన అభివృద్ధి చేశారు. భారతదేశంలో ఆహార సంక్షోభాన్ని జయించడానికి హరిత విప్లవం ద్వారా స్వామినాథన్ చేసిన సేవలు చిరస్మరణీయం. ఆయన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1967లో పద్మశ్రీ, 1972లో పద్మభూషణ్, 1989లో పద్మవిభూషణ్ ప్రదానం చేసింది. 1971లో రామన్ మెగసెసె, 1986లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వరల్డ్ సైన్స్ అవార్డు, 1999లో ఇందిరాగాంధీ శాంతి బహుమతి లభించాయి. ఈయనను యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం (యూఎన్‌ఈపీ) ఫాదర్ ఆఫ్ ఎకనామిక్ ఎకాలజీగా పేర్కొంది.



### ఇయాన్ విల్మట్

- క్లోనింగ్ నిపుణుడు, డాలీ సృష్టికర్త ఇయాన్ విల్మట్(79) సెప్టెంబర్ 11న మరణించారు. 1996లో ఈయన క్లోనింగ్ ప్రక్రియలో డాలీ అనే గొర్రె పిల్లను సృష్టించి సంచలనం సృష్టించారు. క్లోనింగ్, మూలకణాలపై ఆయన విస్తృత పరిశోధనలు చేశారు.

### కార్త్యాయని అమ్మ

- కేరళ రాష్ట్రం చేపట్టిన లిటరసీ మిషన్‌లో చేరి చదువుకున్న అతిపెద్ద వయస్సు గల మహిళగా రికార్డు సృష్టించిన కార్త్యాయని అమ్మ (101) అక్టోబర్ 10న మరణించారు. 96 ఏండ్ల వయస్సులో ఆమె చదువు నేర్చుకుని ఆదర్శంగా నిలిచారు.

### ఎస్.వెంకటరమణన్

- ఆర్బీఐ మాజీ గవర్నర్ ఎస్.వెంకటరమణన్ నవంబర్ 18న కన్నుమూశారు.

### ఫాతిమా బీవీ

- సుప్రీంకోర్టు తొలి మహిళా న్యాయమూర్తి ఫాతిమా బీవీ నవంబర్ 23న మరణించారు. కేరళకు చెందిన ఫాతిమా న్యాయ వ్యవస్థలో అత్యున్నత స్థానానికి చేరిన భారత ముస్లిం మహిళగా కీర్తి గడించారు. పదవీ విరమణ అనంతరం తమిళనాడు గవర్నర్గా సేవలందించారు.



### హెన్రీ కిసింజర్

- అమెరికా దౌత్యవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత హెన్రీ కిసింజర్ నవంబర్ 29న మరణించారు. ప్రచ్ఛన్న యుద్ధం సమయంలో అమెరికా విదేశాంగ విధానాన్ని తీర్చిదిద్దడంలో ఈయన ముఖ్య పాత్ర పోషించారు. రెండు పర్యాయాలు అమెరికా విదేశాంగ మంత్రిగా పనిచేశారు. వియత్నాం యుద్ధ సమయంలో చర్చల ద్వారా పరిష్కారం చేసినందుకు ఆయనకు నోబెల్ బహుమతి (1973) లభించింది. కిసింజర్ సలహాతో అమెరికా అధ్యక్షుడు కాంబోడియాపై జరిపిన రహస్య బాంబు దాడుల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారన్న అపవాదుతో పాటు ప్రపంచ వ్యాప్తంగా అనేక రాజకీయ సంక్షోభాల్లో లక్షలాది మంది మరణానికి కారణమయ్యారనే అపవాదు ఉంది.



### బిందేశ్వర్ పాఠక్



- సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాఠక్ (80) ఆగస్టు 5న మరణించారు. ఈయన 1970లో సులభ్ ఇంటర్నేషనల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్థాపించారు. ఈ సంస్థ ద్వారా మానవ హక్కులు, పర్యావరణ పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాల్లో విశేష కృషి చేశారు. 1974లో సామూహిక మరుగుదొడ్ల సౌకర్యాలను ప్రారంభించారు. ఆయన సేవలకు 1991లో కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం ప్రదానం చేసింది. దుబాయ్ ఇంటర్నేషనల్ అవార్డు అయిన ఎనర్జీ గ్లోబల్ పురస్కారం, సులభ్ కాంప్లెక్స్ టాయిలెట్స్‌ను బయోగ్యాస్ ప్లాంట్లకు అనుసంధానం చేసి శక్తి రంగంలో మూడు దశాబ్దాల కిందటే విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినందుకు ఫ్రెంచ్ సెనేట్ నుంచి లెజెండ్ ఆఫ్ ప్లానెట్ అవార్డు అందుకున్నారు.